GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 182 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం - ఫిబ్రవరి 17-2024 | పేజీలు : 3

## ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపులు..

**టీ మీడియా, ఫిబ్రవరి 16, ఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బల్వంత్ దేశాయ్ పేరుతో ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చాయి. ఫిబ్రవరి 15వ తేదీన హైకోర్టులో బాంబు పేలుడు సంభవిస్తుందని మెయిల్ లో హెచ్చరించారు. అంతేకాదు ఢిల్లీలో జరిగే అతి పేలుడు ఇదేనని%ో% వీలైనంత ఎక్కువ భద్రతను పెట్టుకోవాలని కూడా సూచించారు. ఈ బెదిరింపులు సంచలనం రేకెత్తించాయి. సమాచారం అందిన వెంటనే అధికారులు అలర్ట్ అయ్యారు. హైకోర్టు పరిసరాలతో పాటు ఢిల్లీలోని అన్ని దిగువ కోర్టుల్లో భద్రతను భారీగా పెంచారు. భద్రతా తనిఖీలకు సహకరించాల్సిందిగా హైకోర్టు బార్ అసోసియేషన్ తో పాటు దిగువ కోర్టుల బార్ అసోసియేషన్లు కూడా న్యాయవాదులకు సూచించాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాయి.














# దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్
# సమ్మె విజయవంతం

### కార్మిక, కర్షక చట్టాలను కాల రాస్తున్న కేంద్రం

- పలు చోట్ల, ప్రదర్శన లు,రాస్తా రోకోలు
- నిరసనలో పాల్గొన్న రైతు గుండెపోటుతో మృతి

**టీ మీడియా, ఫిబ్రవరి 16,న్యూఢిల్లీ:** కార్మిక, కర్షక సమ్మెకు గ్రామీణ బంద్ ను పలు రాజకీయ పార్టీలా, ప్రజా సంఘాలు మద్దతుతో విజయవంతం చేశారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్థూపం నుండి తెలంగాణ తల్లి విగ్రహం వరకు పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు ర్యాలీ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూనాయకులు మాట్లాడుతూ రైతులకు ప్రమాదకరమైన చట్టాలను తీసుకువచ్చి, రైతులను ఆదుకోకపోగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చట్టాలు వెంటనే సవరించి రైతులను ఆదుకోవాలని కోరారు. నేటి బందులో నియోజకవర్గ స్థాయిలో పాల్గొని బందును విజయవంతం చేశారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని పని భద్రత కల్పించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లపై సమ్మె చేయడంజరిగిందినీ అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల శ్రమను దోచుకునేలా పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడి ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### నిరసనలో పాల్గొన్న రైతు గుండెపోటుతో మృతి

**న్యూఢిల్లీ:** నిరసనలో పాల్గొన్న వృద్ధ రైతు గుండెపోటుతో మరణించాడు. పంజాబ్-హర్యానా సరిహద్దు ప్రాంతమైన శంభులో ఈ సంఘటన జరిగింది. కనీస మద్దతు ధరతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం రైతులు మరోసారి పెద్ద ఎత్తున నిరసనకు ఢిల్లీ బాటపట్టారు. అయితే హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులు అక్కడ పెద్ద సంఖ్యలో మోహరించారు శుక్రవారం ఉదయం 78 ఏళ్ల రైతుకు గుండెపోటు వచ్చింది. దీంతో తెల్లవారుజామున 4 గంటలకు రాజ్‌పురాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాటియాలాలోని ప్రభుత్వ రాజింద్ర ఆసుపత్రికి అతడ్ని రిఫర్ చేశారు. అక్కడకు తరలించి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తుండగా ఆ వృద్ధ రైతు మరణించాడు. మృతుడ్ని పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన జ్ఞాన్ సింగ్‌గా గుర్తించారు. తొలి విడత నిరసనలో కూడా పలువురు రైతులు చనిపోయారు.మరోవైపు చండీగఢ్‌లో రైతు సంఘాల నేతలతో కేంద్ర మంత్రులు జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ఇప్పటి వరకు మూడు దఫాలుగా చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. హర్యానా ప్రభుత్వం, పోలీసుల చర్యలపై రైతు సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఎస్‌పీకి చట్టపరంగా హామీ, ఇతర డిమాండ్లపై చర్చించారు. రైతుల డిమాండ్లపై ఆదివారం సాయంత్రం మరోసారి చర్చలు జరుగనున్నాయి. ఖమ్మం జిల్లా ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కొత్త సీతారాములు, నగర అధ్యక్షులు నరాల నరేష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు విప్లవ్‌కుమార్, గజ్జి సత్యనారాయణ, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సోనియా గాంధీ ఆస్తుల విలువ రూ.12 కోట్లు

### - సొంత కారు లేదు

**టీ మీడియా, ఫిబ్రవరి 16,న్యూఢిల్లీ:** కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆస్తుల విలువ రూ.12 కోట్లు. ఆమెకు సొంత కారు లేదు. తొలిసారి రాజ్యసభకు నామినేషన్ వేసిన సోనియా గాంధీ తన ఆస్తులు, ఇతర వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మొత్తం ఆస్తులు రూ.12.53 కోట్లుగా ప్రకటించారు. ఇటలీలోని తండ్రి ఇంటి ఆస్తిలో వాటా విలువ రూ.27 లక్షలని తెలిపారు. అలాగే 88 కేజీల వెండి, 1,267 గ్రాముల బంగారం, ఆభరణాలు ఉన్నాయన్నారు. ఢిల్లీలోని డేరా మండి గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు తెలిపారు. ఎంపీ జీతం, రాయల్టీ ఆదాయం, మూలధన లాభాలు వంటివి తన ఆదాయమని చెప్పారు. తన వద్ద రూ.90,000 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. 2019 నాటి ఎన్నికల అఫిడవిట్‌లో మొత్తం ఆస్తుల విలువ రూ.11.82 కోట్లుగా ఆమె వెల్లడించారు., ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న విద్యార్హతల ప్రకారం సోనియా గాంధీ 1964లో సియానాలోని ఇన్స్టిటుటో శాంటా థెరిసాలో ఇంగ్లీష్, ఫ్రెంచ్‌లో మూడు సంవత్సరాల విదేశీ భాషల కోర్సు పూర్తి చేశారు. 1965లో కేంబ్రిడ్జ్‌లోని లెనాక్స్ కుక్ స్కూల్‌లో ఇంగ్లీష్‌లో సర్టిఫికేట్ కోర్సు చేశారు. సోనియా గాంధీకి వ్యక్తిగతంగా కారు లేదు. అలాగే సోషల్ మీడియా ఖాతా కూడా లేదు.

## ఆసుపత్రిలో చేరిన ప్రియాంక గాంధీ



**టీ మీడియా, ఫిబ్రవరి 16,న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా ఆసుపత్రిలో చేరింది. ఈ విషయాన్ని ఆమే స్వయంగా వెల్లడించింది. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరానని, అందువల్ల నేడు భారత్ జోడో న్యాయ్ యాత్ర లో పాల్గొనలేనంటూ ట్వీట్ చేసింది.ప్రియాంక గాంధీ సోదరుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ఇవాళ సాయంత్రం బీహార్ రాష్ట్రం నుంచి ఉత్తరప్రదేశ్‌లోకిప్రవేశించనుంది. న్యాయ్ యాత్ర యూపీలోకి ప్రవేశించిన తర్వాత చందౌలీలో తన సోదరుడితో ప్రియాంక గాంధీ చేరాల్సి ఉంది. అయితే అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరడం వల్ల ఇవాళ యాత్రలో పాల్గొనలేనంటూ వెల్లడించిందిభారత్ జోడో న్యాయ్ యాత్ర ఉత్తరప్రదేశ్‌కు చేరుకోవడానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూశాను. కానీ అనారోగ్యం కారణంగా ఈరోజే నేను ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆరోగ్యం కుదుటపడగానే యాత్రలో చేరతాను' అంటూ ట్వీట్ చేసింది. యాత్ర యూపీలో ప్రవేశిస్తున్న సందర్భంగా తన సోదరుడు రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపింది.రాహుల్ గాంధీ యాత్ర యూపీలోకి ప్రవేశించే సమయంలో ప్రియాంక గాంధీ స్వాగతం పలకాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇప్పుడు అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో చేరడంతో ప్రియాంక గాంధీ ఈ యాత్రలో పాల్గొనడం లేదని చెప్పాయి. అయితే, అనారోగ్యానికి గల కారణాలు ఏంటీ అనేది మాత్రం వెల్లడించలేదు.

## నాణ్యమైన విద్య అనేది ఒక హక్కు

### - సీఎం జగన్



**టీ మీడియా, ఫిబ్రవరి 16, గుంటూరు :** మన పిల్లలు ప్రపంచస్థాయితో పోటీపడాలని.. అప్పుడే భవిష్యత్తు మారుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఉన్నత విద్యారంగంలో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. ప్రముఖ విద్యా పోర్టల్ ఎడ్క్స్‌తో శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ఏపీ విద్యాశాఖ ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఎంవోయూకి సీఎం జగన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. "ఆంధ్రప్రదేశ్ చదువుల చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం. రైట్ టు ఎడ్యుకేషన్ అనేది పాత నినాదం. కానీ.. పిల్లలకు నాణ్యమైన విద్య అనేది హక్కు.. ఇది ఇక కొత్త నినాదం అని అన్నారాయన. నాణ్యమైన విద్యను అదించడంలో మనం వెనకబడితే.. మిగతా వాళ్లు మనల్నిదాటి ముందుకు వెళ్లిపోతారని చెప్పారాయన. ఈదేశంలో ఉన్నవారితోకాదు మన పోటీ.. ప్రపంచంతో మనం పోటీపడుతున్నాం. మన పిల్లలు మెరుగైన ఉద్యోగాలు సాధించాలి. మంచి మంచి జీతాలు సంపాదించాలి. నాణ్యమైన విద్యద్వారానే ఇది సాధ్యం అని అన్నారు. అందుకు విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలి. అప్పుడు మన పిల్లలకు మెరుగైన అవకాశాలు వస్తాయి. ఇప్పుడు మనం చేస్తున్నది ఒక ప్రారంభం మాత్రమే. ఫలాలు అందడానికి కొంత సమయం పట్టొచ్చు. కాని ఎక్కడో ఒకచోట ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఉన్నతవిద్యలో మనం వేస్తున్న అడుగులు ఫలాలు ఇవ్వాలంటే బహుశా నాలుగైదేళ్లు పట్టొచ్చు. కానీ, మనం వేసిన ప్రతి అడుగు కూడా ప్రాథమి విద్య స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ కూడా సమూలంగా మార్చుకుంటూ వస్తున్నాం" అని తెలిపారు. "మానవవనరుల మీద పెట్టుబడి అన్నది ఒక ప్రధాన అంశంగా మన ప్రభుత్వం భావిస్తోంది. అందుకనే ప్రతి అడుగులోనూ కూడా చిత్తశుద్ధి, అంకిత భావం చూపిస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంను ప్రవేశపెట్టాం. గ్లోబల్ సిటిజన్ కావాలంటే మన మాట్లాడే భాషలో మార్పులు రావాలి. ప్రపంచస్థాయితో పోటీపడాలి. అలా చేయకపోతే మన భవిష్యత్తు మారదు. అందుకనే ఇంగ్లిషు మీడియం నుంచి నాడు-నేడు, అమ్మ ఒడి, గోరుముద్దతో మన ప్రయాణం ప్రారంభమైంది" అని సీఎం జగన్ తెలిపారు. "ఇక్కడితోనే మనం ఆగిపోలేదు. వచ్చే పదేళ్లలో టెన్త్ విద్యార్థి ఐబీ విద్యాబోధన అందించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఐబీ వాళ్లతో ఎంవోయూ చేసుకున్నాం. వచ్చే విద్యాసంవత్సరం టీచర్లకు సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టిపెట్టాం. ఆరోతరగతి నుంచి ప్రతి తరగతి గదినీ డిజిటలైజేషన్ చేస్తున్నాం. ట్యాబ్స్ ఇచ్చి పిల్లలకు చదువులు సులభంగా అర్థమయ్యేలా చేస్తున్నాం. బైజూస్ కంటెంట్‌తో అనుసంధానం చేశాం. ఈ ప్రయాణం%ో% ఇక్కడితో ఆగిపోకూడదు" అని అన్నారు.

## ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య



**టీ మీడియా, ఫిబ్రవరి 16,హైదరాబాద్:**తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను సర్కారు నియమించింది. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఎం.రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూ నాయక్ మాలోత్‌ను నియమిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.వీరంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. సిరిసిల్ల రాజయ్య వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ స్థానం నుంచి 15వ లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

### అన్ని కులాలకు న్యాయం చేసేందుకే

## కులగణన

### -సీఎం రేవంత్ రెడ్డి



**టీ మీడియా, ఫిబ్రవరి 16,హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో బీసీ కుల గణన తీర్మానంను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టారు. అసెంబ్లీలో కుల జనగణన తీర్మానంపై చర్చలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కుల గణనపై అనుమానాలొద్దని, చట్ట సభల్లో అన్ని కులాలకు న్యాయం చేసేందుకే కుల గణన అని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జస్టిస్ కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. కుల గణనపై ప్రజలకు అనుమానం లేవనెత్తేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే చేశామని బీఆర్ఎస్ గొప్పలు చెప్పుకుంటుందని, బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే సభలో ప్రవేశపెట్టారా? అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కోసమే బీఆర్ఎస్ అప్పుడు ఆ సర్వే వివరాలను వాడుకుందని అన్నారు. మాకు రాజకీయ దురుద్దేశాలు లేవు.. కులగణనపై అనుమానాలొద్దని రేవంత్ అసెంబ్లీలో చెప్పారు.కుల గణన తీర్మానంపై అనుమానం ఉంటే సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీల సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తీర్మానంపై ఏదైనా లీగల్ చిక్కులపై అంశాలు ప్రతిపక్షాలకు తెలిస్తే తీర్మానం అమలు అయ్యే విధంగా సహకరించాలని రేవంత్ కోరారు. కులగణన వల్ల అరశాతం ఉన్న వాళ్లకు బాధ ఉంటుంది. కడియం శ్రీహరిని ఆయన పార్టీ నేతలే తప్పుదోవ పట్టిస్తున్నారని, కడియంను తప్పుదోవ పట్టించే వాళ్లను బయటకు పంపాల్సిందే లేదంటే గాలి సోకుతుందంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ తీర్మానంతో బలహీన వర్గాలను బలంగా తయారు చేయడమే మా ఉద్దేశం . బాధితలుగా ఉన్నవాళ్లను పాలకులుగా చేయాలన్నదే మా ఆలోచన అని రేవంత్ చెప్పారు.

## ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం..

### -ప్రభుత్వం మారినా మారని ప్రశ్నాపత్రాలు

### -ఆర్థిక మంత్రిగా హరీశ్ రావు




**టీ మీడియా, ఫిబ్రవరి 16,హైదరాబాద్:**రాష్ట్రంలో విద్యాశాఖ అధికారుల తీరు మారడం లేదు. ఇంటర్ బోర్డులో పరీక్షల నిర్వహణంలో ఏటా తప్పులు పరిపాటిగా మారింది. ఈ ఏడాది వార్షిక పరీక్షలకు ముందే ప్రాక్టికల్ ఎగ్జామ్స్‌లోనే అధికారుల అలసత్వం బయటపడింది. ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షల్లో శుక్రవారం ఇంగ్లీష్ ఎగ్జామ్ పెట్టారు. దీంట్లో విద్యార్థులు చదివి వినిపించాల్సిన పారాగ్రాఫ్ లో ప్రభుత్వం మారిందన్న విషయం కూడా మర్చిపోయి పాత డేటాతోనే ఎగ్జామ్ పెట్టారు. దాంట్లో ఆర్థిక మంత్రిగా హరీశ్ రావు ఉన్నట్లుగానే యథావిథిగా క్వశ్చన్ ను అడిగారు. ప్రభుత్వం మారిన కనీసం ప్రస్తుతం ఇలాంటి కరెంట్ అఫైర్స్ ఛేంజ్ అయ్యే ప్రశ్నను తొలగించాలన్న ఆలోచన ఇంటర్ బోర్డు అధికారులకు లేదని పలువురు విమర్శిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రశ్నకు సంబంధించి 20 పారాగ్రాఫ్ లలో ఏదో ఒకటి ఇచ్చి దాన్ని చదవాలని విద్యార్థులకు పరీక్షలో ఇస్తారు. ఇందులో క్వశ్చన్ బ్యాంక్ లో ఉన్న ప్రశ్నను యథాతథంగా ఇవ్వడంతో పలు చోట్ల ఈ పారాగ్రాఫ్ చదవాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులు ఆర్థికమంత్రి హరీశ్ రావు అంటూ ప్రాక్టికల్ ఎగ్జామ్ ముగించారు. దీనిపై ఇంటర్ లెక్చరర్స్ జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులను తప్పుదోవ పట్టించేలా ఇలాంటి ప్రశ్నలను కొనసాగించడం పూర్తిగా నిర్లక్ష్యమేనంటూ మండిపడ్డారు. కారకులైన అధికారులపై చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేసాశారు. రానున్న రోజుల్లో జరిగే ఇంటర్ బోర్డు వార్షిక పరీక్షలను పారదర్శకంగా ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ర్యాగింగ్ భూతం దిష్టిబొమ్మ దగ్ధం చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

**- ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే ర్యాగింగ్ కి నిదర్శనం**



**టీ మీడియా, ఫిబ్రవరి 16, గోదావరిఖని :** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విజృంభిస్తున్న ర్యాగింగ్ భూతం దిష్టిబొమ్మను శుక్రవారం దగ్ధం చేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి ఈ ప్రాంతానికి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి , గొప్పగా ఎరగాలని ఎన్నో ఆశలతో ఆశయాలతో కళాశాలకు వస్తే వారి కలలను,ఆశలను , ఆశయాలను కొంతమంది సీనియర్లు విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో జూనియర్ విద్యార్థులను వేధింపులకు, మనోవేదనకు గురి చేసి ఆత్మహత్యలకు పాల్పడే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. జూనియర్ విద్యార్థులకు,సీనియర్ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలే కానీ,ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని ఆయన అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే ఈ ర్యాగింగ్ కి నిదర్శనమని,వారాణి కి నాలుగు రోజులు కూడా మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్ హాజరు కారని , విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా అని,ఆయన సూటిగా ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఏమైనా ప్రిన్సిపాల్ దే బాధ్యత అని ఆయన అన్నారు. ర్యాగింగ్ కి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సహాయ కార్యదర్శి మొలుగురి నితీలేష్,ఓరుగంటి రాహుల్,శంకర్,నీటు అక్కపాక సాయి చరణ్,తదితరులు పాల్గొన్నారు.

## త్యాగరాయ గానసభలో 'రాజా'కు సన్మానం







**టి మీడియా, ఫిబ్రవరి 16, గోదావరిఖని :** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా లలిత కళావేదికలో గురువారం రాత్రి నిర్వహించిన వినోదాల విందు-కామెడీ షో లో గోదావరిఖనికి చెందిన ప్రముఖ హాస్య కళాకారుడు 'మేజిక్ రాజా'ను క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంవి సుబ్రహ్మణ్యం, సినీ, టివి నటులు బుగత సత్యనారాయణ, విద్యాసాగర్ ఆత్మీయంగా సన్మానించి, అభినందించారు. అంతకుముందు సుబ్రహ్మణ్యంతో కలిసి 'రాజా' ప్రదర్శించిన పశువుల కాపరి, ఇంటర్వ్యూ, అ.ఆ.హెూ కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. అలాగే జెయల్ నరసింహం, కామేశ్వరరావు హాస్య ప్రసంగాలు, కాపర్తి నరేష్, కోకిల వేణుగోపాల్ మిమిక్రీ జుగల్ బందీ, ఆర్వీ రమణ, మూర్తి, జెన్ని, మల్లాది భాస్కర్, నిట్టల శ్రీరామమూర్తి, చలపతి, శారద, జ్యోతి, కృష్ణారావు ప్రదర్శించిన అద్దె ఇల్లు, ఆర్టీసి బస్సు, పేకాట రాదు, రాయడు-రాస్తాడు, బెంగుళూరు బావమరుదులు, గోడలో బుర్ర దూరింది, రాసేయండి స్కిట్లు ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తగా అతిధులు కళాకారులను అభినందించి, శాలువాలతో సత్కరించారు.

## పీవోడబ్ల్యు అధ్యక్షురాలు సంధ్య భర్త మృతి



**టీ మీడియా, ఫిబ్రవరి 16,హైదరాబాద్:** పీవోడబ్ల్యు (ప్రగతిశీల మహిళా సంఘం) అధ్యక్షురాలు సంధ్య భర్త రామకృష్ణా రెడ్డి మృతి చెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో గల అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ఆయనకు ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. రామకృష్ణా రెడ్డి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. సంధ్య భర్త మృతి చెందిన విషయం తెలిసి వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఆసుపత్రికి చేరుకున్నారు. వారు రామకృష్ణా రెడ్డికి నివాళులు అర్పించారు. ఆయన భార్య సంధ్యను ఓదార్చారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన

**- ఆస్పిరెంట్స్ అకాడమీ డైరెక్టర్ నిహార్ వర్మ ముత్యం**




**టీ మీడియా, ఫిబ్రవరి 16, మంచిర్యాల్:** మంచిర్యాల జిల్లాలోని ఆస్పిరెంట్స్ అకాడమీలో కోచింగ్ తీసుకొని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణులై ఉద్యోగం సాధించిన సాయి ప్రవళిక మరియు దుర్గా ప్రసాద్ ఏఆర్ కానిస్టేబుల్ గా ఎంపిక కావడం జరిగింది. రాజ్కుమార్, శ్రీనివాస్, దినేష్ సివిల్ కానిస్టేబుల్ గా ఎంపిక కావడం జరిగింది. వారిని ఆస్పిరెంట్స్ అకాడమీ డైరెక్టర్ నిహార్ వర్మ ముత్యం శుక్రవారం అభినందించి శాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కానిస్టేబుల్ ఉద్యోగంతోనే ఆగకుండా పై స్థాయి ఉద్యోగాలకు కూడా ప్రయత్నం చేసి సాధించాలని వారిని ప్రోత్సహించారు. ఇంతటి పోటీలో కూడా నెగ్గి ఉద్యోగం సాధించిన అభ్యర్థులను వారిని కనిపెంచిన తల్లిదండ్రులను కూడా అభినందించారు.

## పొత్తులలో త్యాగం చేసిన నేతలకు గుర్తింపు, ప్రాధాన్యం

**టీడీపీ అధినేత చంద్రబాబు**



**టీ మీడియా, పిబ్రవరి 16, అమరావతి:** పార్టీ నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబుటెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులకు సహకరించే నేతలకు అధికారంలోకి రాగానే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. పొత్తులు ఉన్నందున.. టికెట్ రాలేదని ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. పార్టీని నమ్ముకున్న వారికి కచ్చితంగా గుర్తింపు, ప్రాధాన్యం ఉంటాయని చంద్రబాబు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. జగన్ తో విసిగిపోయిన వైసీపీ నేతలు టీడీపీలో చేరతాం అంటున్నారు%ా% కానీ, మంచివారు, పార్టీకి ఉపయోగపడతారనుకునే వాళ్లనే తీసుకుంటున్నామని వెల్లడించారు. టీడీపీ నేతలు అలాంటి వారి చేరికలను ప్రోత్సహించాలని, వారితో కలిసి పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారురా కదలిరా' సభలు ముగిశాక మరో ప్రజాచైతన్య యాత్రకు శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు. ఎన్నికలకు దాదాపు 50 రోజులే ఉన్నందున ప్రతి ఒక్కరూ సీరియస్ గా పనిచేయాలని స్పష్టం చేశారు. బీసీ సాధికార సభలకు మంచి స్పందన వచ్చిందని, ప్రతి నియోజకవర్గంలో బీసీ సాధికార సభలు నిర్వహించాలని అన్నారు. జగన్ మోసం చేశారనే భావన ప్రతి ఒక్క బీసీ వ్యక్తిలో ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. బీసీల అభ్యున్నతి కోసమే ఏర్పడిన పార్టీ టీడీపీ పార్టీలో బీసీలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుంది అని పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

**-11 మంది దుర్మరణం**



**టీ మీడియా, ఫిబ్రవరి 16, హైదరాబాద్ :** దేశ రాజధాని ఢిల్లీ అలీపూర్‌లోని మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో ఇప్పటి వరకు 11 మంది దుర్మరణం చెందారు. ఓ పేయింట్ పరిశ్రమలో గురువారం సాయంత్రం మంటలు చెలరేగాయి. మంటలు సమీపంలోని దుకాణాలతో పాటు ఇండ్లకు వ్యాపించాయి. అలీపూర్‌లోని దయాల్‌పూర్ మార్కెట్‌లోని ఫ్యాక్టరీలో 11 మంది కాలిపోయిన మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదంలో ఒక పోలీసు సహా నలుగురు గాయపడి చికిత్స పొందుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఇద్దరు అగ్నికీలల్లో చిక్కుకుపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. గురువారం సాయంత్రం 5.25 గంటలకు అగ్నిమాపక సిబ్బంది ప్రమాదం గురించి సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకొని నాలుగు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, మంటల చెలరేగడానికి ముందు ఫ్యాక్టరీలో పేలుడు శబ్దం వినిపించింది. అక్కడ నిల్వ ఉంచిన రసాయనాలతో పేలుడు సంభవించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. 'పరిశ్రమ పక్కనే ఉన్న నాషా ముక్తి కేంద్రంలోకి మంటలు వ్యాపించాయి. పేలుడు కారణంగా భవనం కూలిపోయింది. 11 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో వారిని గుర్తించడం కష్టంగా ఉంది' అని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ అతుల్ గార్గ్ తెలిపారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు తెలియదని.. గల్లంతైన వారి కోసం గాలింపు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

# రైతులకు మేలు చేసే పథకాలపై పని చేస్తున్నాం

**-ప్రధానమంత్రి నరేంద్రమోడీ**



**టీ మీడియా, ఫిబ్రవరి 16, చండీగఢ్:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం హరియాణాలో పర్యటించారు. రేవాడీలోని ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేసిన ప్రధాని.. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. "రైతులకు మేలు చేసే పథకాలపై మా ప్రభుత్వం పని చేస్తోంది. గతంలో అన్నదాతలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేవి కాదు. కానీ దానిపై మేం వారికి గ్యారంటీ ఇచ్చాం" అని తెలిపారు. రైతుల ఆందోళన కొనసాగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని కోరుతూ అన్నదాతలు చేపట్టిన ఆందోళన మూడోరోజూ కొనసాగుతోంది. దీనిపై రైతు సంఘాలతో కేంద్రమంత్రులు గురువారం జరిపిన చర్చలు ఫలించలేదు. తమ ఆందోళనను ఉద్ధృతం చేస్తామని, తప్పకుండా దిల్లీ చేరుతామని రైతన్నలు చెబుతున్నారు. ప్రస్తుతం వీరంతా పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోనే ఉన్నారు. అటు, దేశ రాజధాని సరిహద్దుల్లోనూ భారీగా బలగాలు మోహరించాయి. రేవాడీ సభలో ప్రధాని కాంగ్రెస్‌పై మరోసారి విరుచుకుపడ్డారు. శ్రీరాముడంటే ఊహ, అయోధ్యలో ఆలయనిర్మాణం వద్దన్న వాళ్లే ఇప్పుడు 'జై సీతారామ్' అని నినదిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆర్టికల్ 370 రద్దుకు దశాబ్దాల పాటు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించిందని, కానీ తమ ప్రభుత్వం దానిపై గ్యారెంటీ ఇచ్చి నెరవేర్చిందని గుర్తుచేశారు.

# కులగణన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం



**టీ మీడియా, ఫిబ్రవరి 16,హైదరాబాద్ :** కులగణన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో సమగ్ర కులగణన, సామాజిక, ఆర్థిక ఇంటింటి సర్వేకు మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. చట్టబద్ధత ఉంటేనే ఈ కార్యక్రమం ఫలవంతమవుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ పేర్కొన్నారు. న్యాయ విచారణ కమిషన్ వేయాలని, బిల్లు కోసం అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలని కోరారు. కులగణన కోసం బిల్లు తెస్తే తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రెండ్రోజుల్లో బిల్లును ఆమోదించుకుందామని తెలిపారు. అయితే కులగణనకు చిత్తుశుద్ధి అవసరమని, బిల్లు కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే చేసినా వివరాలు బయటపెట్టలేదని అన్నారు. తీర్మానంపై చర్చ అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్టు స్పీకర్ ప్రకటించారు.

# కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల పునరుద్ధరణ



**టీ మీడియా, ఫిబ్రవరి 16,న్యూఢిల్లీ :** తమ పార్టీకి చెందిన పలు బ్యాంకు ఖాతాలను ఆదాయపన్ను శాఖ స్తంభింపచేసినట్లు కాంగ్రెస్ శుక్రవారం పేర్కొంది. వాటిలో యూత్ కాంగ్రెస్ ఖాతా కూడా ఉందం తెలిపారు. అయితే ఆదాయపుపన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో అప్పీలేట్ చేయడంతో గంట తర్వాత ఉపశమనం లభించింది. వచ్చే వారం తుది విచారణ వరకు ఖాతాలను పునరుద్ధరించనున్నట్లు ఐటి శాఖ వెల్లడించింది. తమ బ్యాంకు ఖాతాల్లో రూ.115 కోట్ల నగదు ఉండేలా చూడాలం పార్టీ ఆదేశించినట్లు కాంగ్రెస్ పేర్కొంది. ఐటి అధికారుల నుండి వచ్చిన ఆదేశాలకం అనుగుణంగా రూ.115 కోట్లను ఫ్రీజ్ చేసినట్లు పార్టీ తెలిపింది.

# బసవతారకం ఆస్పత్రిలో 'యాక్ట్' క్లినిక్




**టీ మీడియా, ఫిబ్రవరి 16,హైదరాబాద్ సిటీ:** కేన్సర్ వ్యాధిని జయించిన సర్వైవర్స్ మున్ముందు ఇబ్బందులు ఎదుర్కోకుండా జీవితాన్ని సాఫీగా గడపడానికి యాక్ట్ (ఆఫ్టర్ కాంప్లిషన్ ఆఫ్ థెరపీ) క్లినిక్‌ను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ కేన్సర్ డే సందర్భంగా శుక్రవారం ఇండియన్ కేన్సర్ సొసైటీ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పూర్ణ కుర్కురే ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం కారణంగా ఇప్పుడు కేన్సర్‌ను జయించిన వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కఅష్ణయ్య మాట్లాడుతూ చికిత్స పూర్తి అయిన తర్వాత సాధారణ జీవనాన్ని సాగించడానికి అవసరమైన సలహాలు, సూచనలు, ఇతరత్రా ఇబ్బందులను దూరం చేయడానికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు ఎంవీటీ కఅష్ణమోహన్, డాక్టర్ సెంథిల్ రాజప్ప, కల్పనా రఘునాథ్, వీరేంద్ర పాటిల్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లు సీజ్

**- అజయ్ మాకెన్**



**టీ మీడియా, ఫిబ్రవరి 16, న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంకు అకౌంట్లను మూసివేశారు. అకౌంట్లు సీజ్ చేసిన విషయాన్ని ఆ పార్టీ నేత అజయ్ మాకెన్ వెల్లడించారు. ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తెలిపింది. సుప్రీం తీర్పుతో రాజకీయ పార్టీలకు ఫండింగ్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను సీజ్ చేసినట్లు తెలుస్తోంది. తాము ఇచ్చే చెక్కులను బ్యాంక్‌లు తీసుకోవడంలేదని తమకు సమాచారం అందినట్లు కాంగ్రెస్ నేత మాకెన్ తెలిపారు. యూత్ కాంగ్రెస్ బ్యాంక్ అకౌంట్లను ప్రభుత్వం సీజ్ చేసినట్లు మాకెన్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అకౌంట్లు కూడా సీజ్ అయ్యాయన్నారు. యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నుంచి 210 కోట్లు రికవరీ చేసేందుకు ఆదాయపన్ను శాఖ అడుగుతున్నట్లు చెప్పారు. ఎన్నికలకు రెండు వారాల ముందే విపక్షాల అకౌంట్లను సీజ్ చేశారని, ఇది ప్రజాస్వామ్యాన్ని సీజ్ చేసినట్లే అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం తమ వద్ద డబ్బు లేదని, విద్యుత్తు బిల్లు, ఉద్యోగుల జీతాలు ఇచ్చేందుకు అమౌంట్ లేదన్నారు. అన్నింటిపైనా ప్రభావం పడుతుందని, రాహుల్ గాంధీ న్యాయ యాత్రతో పాటు రాజకీయ కార్యక్రమాలపై ప్రభావం పడుతుందన్నారు.

## రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



**టీ మీడియా, ఫిబ్రవరి 16,రాజన్న సిరిసిల్ల :** వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు శుక్రవారం పోటెత్తారు. మేడారం జాతర సమీపిస్తున్నందున సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాముననే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కోడె మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో గంటతరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. కోడె మొక్కుకోసం భక్తులు క్యూ లైన్లో దాదాపు 2 గంటలపాటు నిలబడి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు జాతరను తలపించాయి. అధికారులు భక్తులకు ఇబ్బం దులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మద్యాన్నం 12.30 గంటలవరకు రాజన్నను సుమారు 35వేలకు పైగా దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

## స్పందించి రక్త దానం చేసిన విరేశం



**టీ మీడియా, ఫిబ్రవరి 16, గోదావరిఖని :** ఆలయ ఫౌండేషన్ మెసేజ్ కీ స్పందించి గోదావరిఖని కీ చెందిన యువకుడు ఆక్సిడెంట్ అవ్వడం తో కరీంనగర్ రేనే హాస్పిటల్ లో ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా గోదావరిఖని తిలక్ నగర్ కు చెందిన ఎల్.వీరేశం స్పందించి శుక్రవారం కరీంనగర్ రేనే హాస్పిటల్ కు వెళ్లి రక్త దానము చేసారు. వీరేశం రక్తదానం చేయడం ఇది 37వ సారి రక్తదానం చేసి యువతకు స్ఫూర్తి గా నిలిచిన వీరేశం కు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అభినందనలు తెలియజేసారు.

## రాష్ట్రంలో మరో 25 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

**టీ మీడియా, ఫిబ్రవరి 16, హైదరాబాద్:** తెలంగాణలో బదిలీల పర్వం కొనసాగుతున్నది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం బదిలీలు చేపడుతున్నది. ఇదిలా ఉండగా.. రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్టీజోన్-1, మల్టీజోన్-2 పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న తహశీల్దార్లను. ఈ ఏడాది జూన్ 30 నాటికి పదవీ విరమణ చేయనున్న మరో 17 మంది తహసీల్దార్‌లను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. మల్టీజోన్-1 పరిధిలో మొత్తం 81 మంది తహశీల్దర్‌లు, మల్టీజోన్-2 పరిధిలో మొత్తం 48 మంది తహశీల్దార్‌లకు స్థానచలనం కలిగించింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 32 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది.

## నేడు మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

**టీ మీడియా, ఫిబ్రవరి 16, గోదావరిఖని:** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నేడు రామగుండం నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజున ఉదయం 10 గంటలకు గోదావరిఖని ప్రధాన చౌరస్తా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ 11 గంటలకు మెడికల్ కళాశాలలో రోగులు కు పండ్ల పంపిణీ 12 గంటలకు విలేజ్ అంతర్గంలో గిఫ్ట్ ఇస్మాయిల్ లో భాగంగా పేద మహిళ నూతన ఇల్లు బహుమతిగా అందించనున్నామని తెలిపారు. రెండు గంటలకు పెద్దపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు అనుబంధ సంఘాలు ,తెలంగాణ ఉద్యమకారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




## భారతీయులపై దాడుల్ని నిలువరించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం

**- వైట్‌హౌజ్**

**టీ మీడియా, ఫిబ్రవరి 16, వాషింగ్టన్:** ఇటీవల అమెరికాలోని భారతీయ విద్యార్థులపై వరుస దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై శ్వేతసౌధం స్పందించింది. భారతీయులు, భారతీయ విద్యార్థులపై దాడుల్ని నిలువరించేందుకు బైడెన్ సర్కార్ తీవ్రంగా శ్రమిస్తున్నట్లు వైట్‌హౌజ్ వెల్లడించింది. నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్ జాన్ కిర్బీ దీనిపై ప్రకటన చేశారు. హింసకు ఎటువంటి చోటు లేదని, ఎవర్నీ క్షమించేదిలేదని, మతం, వర్ణం ఆధారంగా జరిగే హింసను క్షమించబోమన్నారు. అమెరికాలో ఆ రకమైన హింసకు ఏమాత్రం స్థానం లేదన్నారు. భారతీయులపై జరిగే దాడుల్ని నిలువరించేందుకు బైడెన్ సర్కార్ తీవ్రంగా శ్రమిస్తోందని, అన్ని రాష్ట్రాలు, స్థానిక అధికారులతో ఈ అంశాన్ని చర్చిస్తున్నామని కిర్బీ తెలిపారు.

టీ-మీడియా ఆన్‌లైన్ సర్వీసెస్

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ నిబంధనలు ప్రకారం మీడియా (యూట్యూబ్‌లు, వెబ్‌సైట్‌లు, ఈ పేపర్స్ తదితర) గుర్తింపు కోసం చట్టపరమైన ఇబ్బంది లేకుండా అవసరం అయిన సర్టిఫికేట్ల దరఖాస్తులు ప్రాసెసింగ్ చేయబడును.

టీ- మీడియా ఆన్‌లైన్ సర్వీసెస్ : 8500515365

టి మీడియా ఆన్‌లైన్ సర్వీస్ ప్రారంభం

మీరు ఉన్న దగ్గర నుండే సేవలు కోసం కాల్ చేయండి : 8500515365

1. కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ, స్వదేశి విద్య కోసం ఇచ్చే ఆర్ధిక సహాయాల దరఖాస్తులు ప్రాసెసింగ్
2. ఎమ్మెల్సీ ఓటు, జనరల్ ఓటు నమోదు కోసం
3. లేబర్ డిపార్ట్మెంట్ లైసెన్స్ అప్లికేషన్ ప్రాససింగ్
4. కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో డిజిటల్ మీడియా నిర్వహణ కోసం
5. ప్రభుత్వ పథకాలు ఇతర కాంపిటేటివ్ పరీక్షల దరఖాస్థులు ప్రాసెసింగ్ తదితర ఆన్లైన్ సర్వీస్ లు